క్లుప్తంగా

విశేష పూజలు


సాక్షి గణపతి

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం శ్రీశైలమహాక్షేత్రంలోని సాక్షి గణపతికి, జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతి, వీరభద్రస్వాములకు పంచామృతాలు, ఫలోదకాలు, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు.

వెండి సామాన్లు విరాళం


దేవస్థానానికి వెండి వస్తువులను అందజేస్తున్న దాతలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానానికి హైదరాబాద్, హుజూర్‌నగర్‌కు చెందిన అద్దంకి నరసింహారావు, హరిత దంపతులు వెండి వస్తువులను విరాళంగా అందజేశారు. బుధవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు 995 గ్రాముల వెండి బిందెలు–2, 1.665 కేజీల గంధాక్షరి గిన్నెల సెట్‌ను ఆలయ పర్యవేక్షకులు కె.అయ్యన్న, ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునలకు అందజేశారు. దాతలకు దేవస్థానం తరపున రశీదును అందజేసి వేదాశీర్వచనంతో స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.

వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలి


రైతులకు విత్తన ప్యాకెట్లు అందజేస్తున్న ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి

ఆత్మకూరు: వ్యవసాయ అధికారుల సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని వడ్ల రామాపురం, కష్టాపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఆయన మినుము పంటలో విత్తనశుద్ధి, తెగుళ్ల నివారణపై పలు సూచనలు చేశారు. అనంతరం సబ్సిడీపై మినుము విత్తనాలను అంజేశారు.

మహానందిలో వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడి పూజలు


జాతీయ అధ్యక్షుడు మిలిన్ పరండేకు మెమొంటో అందిస్తున్న వేదపండితులు

మహానంది: మహానందీశ్వర స్వామి సన్నిధిలో విశ్వ హిందూ పరిషత్ జాతీయ అధ్యక్షుడు మిలిన్ పరండే బుధవారం పూజలు నిర్వహించారు. వీహెచ్‌పీ దక్షిణ భారత కార్యదర్శి శ్యామ్ సత్యంజీ, అధ్యక్షుడు సాయిరెడ్డిలతో కలిసి వచ్చిన ఆయన స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వారికి వేదపండితులు రవిశంకర్ అవధాని.. స్వామి వారి మెమొంటో, ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు ఈఓ శ్రీనివాసరెడ్డి స్వాగతం పలికారు.

శివలీలామృతంపై ప్రవచనం


ప్రవచనం వినిపిస్తున్న సందీప్‌శర్మ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై రాజమహేంద్రవరానికి చెందిన తాతా సందీప్ శర్మ.. శివలీలామృతంపై ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక


ఉమేరాజాస్మిన్

ఆత్మకూరు: కురుకుంద గ్రామ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని ఉమేరాజాస్మిన్ అండర్–14 జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికై నట్లు హెచ్‌ఎం వెంకటస్వామి తెలిపారు. విద్యార్థినిని బుధవారం పీడీ చెన్నమ్మతో కలిసి ఆయన అభినందించారు.

నాటు సారా విక్రయిస్తే చర్యలు తప్పవు

నందికొట్కూరు: నాటు సారా విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐ జుఫ్రుల్లా హెచ్చరించారు. బుధవారం నీలిషికారిపేటలో నాటు సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 1,000 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి పారబోశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్‌ఐ మాట్లాడుతూ నాటు సారా తయారు చేయడం నేరమన్నారు.

తీర్మానం చేసినా బిల్లు చేయడంలో నిర్లక్ష్యమేంటి

- సర్వసభ్య సమావేశంలో ఏఓపై ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి ఆగ్రహం


సమస్యను సభ దృష్టికి తెస్తున్న ఎంఈఓ సుభాన్


మాట్లాడుతున్న ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి

పగిడ్యాల: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వేరేచోటకి తరలించాలని గత సభలోనే తీర్మానం చేసినా బిల్లు చేయడంలో నిర్లక్ష్యమేమిటని ఉద్యోగం చేయడం ఇష్టం లేకపోతే మానేసి రాజకీయాలు చేసుకోవాలని ఎంపీడీఓ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఓ) నాగరాజరావుపై ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. స్థానిక సంతమార్కెట్‌లోని ప్రాథమిక పాఠశాలలో ఉండే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటుకు తరలించాలని కోరుతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని ఎంఈఓ సుభాన్ సభ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎంపీపీ.. ఏఓను పిలిచి లోపం ఎక్కడ ఉందని ప్రశ్నించారు. విద్యుత్ అధికారులు తనకు ఎస్టిమేషన్ ఇవ్వలేదని, అందుకే బిల్లులు చేయలేదని ఏఓ సమాధానం ఇవ్వడంతో ఎంపీపీ మండిపడ్డారు. ఇప్పటికే మూడు సమావేశాలు జరిగిపోయాయని, ట్రాన్స్‌ఫార్మర్ తరలింపునకు నిధులు కేటాయించినా బిల్లులు పెట్టడానికి జాప్యం చేయడం ఏమిటని నిలదీశారు. బోరు మరమ్మతులకు మండల పరిషత్ ఇస్తున్న రూ.5 వేలు సరిపోవడం లేదని, ఒక్కసారి బోర్ రిపేరీ చేస్తే మెకానిక్ ఖర్చు రూ. 3 వేలు వస్తుందని సంకిరేణిపల్లె సచివాలయ కార్యదర్శి కోట్ల వెంకటేశ్వర్లు సభ దృష్టికి తెచ్చారు. ఎంపీడీఓ సుమిత్రమ్మ స్పందిస్తూ రూ.5 వేలతోపాటు సర్పంచ్‌లతో కోఆర్డినేట్ చేసుకుని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. పక్కా గృహ నిర్మాణాలను 2025 మార్చి చివరి నాటికి లబ్ధిదారులు పూర్తి చేసుకోవాలని ఆ గడువు దాటితే పైసా కూడా బిల్లులు రావ ని ఇన్‌చార్జ్ హౌసింగ్ ఏఈ అరుణ్‌కుమార్ సభ్యుల దృష్టికి తెచ్చారు. గ్రామాల్లో జరిగే బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని సీడీపీఓ కోటేశ్వరమ్మ కోరారు. ముచ్చుమర్రి సాగునీటి సంఘం ఎన్నిక నవంబర్‌లో ఉంటుందని ఆయకట్టు రైతులందరికీ ఓటు హక్కు ఉంటుందని కేసీ కెనాల్ నీటిపారుదల శాఖ ఏఈఈ నరేష్ వెల్లడించారు. దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ పల్లె అరుణమ్మ ఈఓఆర్డీ నాగేంద్రయ్యను కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సభలో తీర్మానం చేసిన పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు పుల్యాల దివ్య పాల్గొన్నారు.

చదువుతోనే సమాజాభివృద్ధి

పాములపాడు: మహిళల చదువుతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక ధనలక్ష్మి మహిళా మండలి కార్యాలయంలో వయోజన విద్య ఆధ్వర్యంలో ఉల్లాస్(అందరికి జీవిత కాల అభ్యాసం) కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పొదుపు గ్రూపుల్లో చదువు రాని మహిళకు చదువు వచ్చిన మహిళలు వలంటీర్లుగా ఏర్పడి చదువు నేర్పించాలన్నారు. కార్యక్రమాన్ని ఉమ్మడి కర్నూలు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ –2 సుభాషిణి పాల్గొన్నారు.

కార్మికుల జీవితాలతో ఆడుకోవద్దు

పగిడ్యాల: భవన నిర్మాణ కార్మికుల జీవితాలతో ఆడుకోవద్దని సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. బుధవారం బస్టాండు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాటాలతో సాధించుకున్న సంక్షేమ చట్టాలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు.

పామాయిల్ మొక్కల పెంపకం లాభదాయకం


పామాయిల్ మొక్కను నాటిస్తున్న ఉద్యాన అధికారిణి చందన

పాములపాడు: పామాయిల్ మొక్కల పెంపకం లాభదాయకమని ఉద్యాన అధికారిణి చందన అన్నారు. బుధవారం మండలంలోని జూటూరు గ్రామంలో పామాయిల్ మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో పామాయిల్ సాగుకు రైతులు ఇప్పుడిప్పుడే ఆసక్తి చూపుతున్నారన్నారు. రైతులకు కావాల్సిన సాంకేతిక, సబ్సిడీ ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తున్నారు. అనంతరం లింగాల, చెలిమిల్ల గ్రామాల్లో పూల తోటలను, చిక్కుడు, బీర తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు విజయ్, అశోక్, ఎంపీఈఓ సునీత పాల్గొన్నారు.

గ్రామ సభలు

నందికొట్కూరు: మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. భూ సమస్యలు పరిష్కరించాలని సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు డీటీకి వినతిపత్రం అందించారు.

- కొత్తపల్లి: మండల పరిధిలోని నందికుంట గ్రామ సచివాలయ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, సర్పంచు నిత్యలక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.
- జూపాడుబంగ్లా: మండలంలోని పి.లింగాపురం గ్రామంలో సర్పంచ్ నాగార్జునరెడ్డి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, మండల సర్వేయర్ షాద్‌మాన్ అతీఫ్, వీఆర్వో శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.
- మిడుతూరు: మండల పరిధిలోని 49–బన్నూరు గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ సునీల్‌రాజ, మండల సర్వేయర్ కృష్ణుడు పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు వేయించాలి

పాములపాడు: కాలానుగుణంగా వ్యాపించే వ్యాధుల నుంచి జీవాలను కాపాడుకునేందుకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని జిల్లా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు సూచించారు. బుధవారం మండలంలోని రుద్రవరం గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పశువుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఏ మాత్రం నలతగా ఉన్నా వెంటనే పశు వైద్యాధికారిణి సంప్రదించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని పశు వైద్యశాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలోపశువైద్యాధికారి అనిల్, గొర్రెల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదాన శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రక్తదానం చేసేవారు 9963384426 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన

నందికొట్కూరు: సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని బ్రాహ్మణకొట్కూరు ఎస్‌ఐ తిరుపాలు విద్యార్థులకు సూచించారు. బుధవారం వడ్డేమాన్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థి ఎం.మధుసూదన్ అభినందించారు. హెచ్ ఎం జుబేదాబేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసు నమోదు

మిడుతూరు: మండల పరిధిలోని పీరుసాహెబ్ పేట గ్రామానికి చెందిన కుంచెపు రామకృష్ణ, వెంకటరమణ, మధుకుమార్, మధుమోహన మధు గోపాల్, మద్దిలేటి, సుబ్బమ్మలపై బుధవారం దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఓబులేసు తెలిపారు. పాత కక్షలతో తమపై దాడి చేశారని అదే గ్రామానికి చెందిన సంపంగి రామ శ్రీధర్, శివకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రతి గ్రామంలో పనులు కల్పించాలి


మాట్లాడుతున్న ఏపీడీ అన్వరాబేగం

కొత్తపల్లి: ప్రతి గ్రామంలో ఉపాధి పనులు కల్పించాలని ఆత్మకూరు ఏపీడీ అన్వరాబేగం ఉపాధి సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ వేతనదారులకు కల్పించాల్సిన పనిదినాల లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ చేరుకోవాలన్నారు. హార్టికల్చర్ సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మేరి, ఏపీఓ హరికృష్ణ, ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్, పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు


విద్యార్థికి కంటి పరీక్షలు చేస్తున్న కంటి వైద్యాధికారి షేక్ షావలి

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 237 మంది విద్యార్థులకు కంటి వైద్యాధికారి షేక్ షావలి కంటి పరీక్షలు నిర్వహించారు. ఆరుగిరికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. వీరికి అద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ


స్టేషన్ గదులను పరిశీలిస్తున్న ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్

జూపాడుబంగ్లా: స్థానిక పోలీసుస్టేషన్‌ను బుధవారం ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్‌ఐ లక్ష్మీనారాయణకు సూచించారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. డీఎస్పీ వెంట నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఎస్‌ఐ లక్ష్మీనారాయణ ఉన్నారు.

అంధకారంలో లింగాలగట్టు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట మజారా గ్రామమైన లింగాలగట్టు మూడురోజులుగా అంధకారంలో ఉండిపోయింది. గతంలో ఎలక్ట్రిక్ ఫీడర్లు స్విచ్‌యార్డ్‌లో ఉండేవి. 40 ఏళ్ల క్రితం లింగాలగట్టుకు విద్యుత్ సరఫరా చేసేందుకు భూగర్భ కేబుళ్లను ఏర్పాటు చేశారు. నూతనంగా సున్నిపెంటలో నిర్మించిన 33–11కెవి సబ్‌స్టేషన్ నుంచి కూడా అదే కేబుల్ వ్యవస్థ ద్వారా లింగాలగట్టుకు విద్యుత్ సరఫరా అవుతోంది. తరచూ సున్నిపెంట, లింగాలగట్టు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుండడంతో డివిజనల్ ఇంజినీర్ జయశంకర్ ఆధ్వర్యంలో నూతన కేబుల్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. బుధవారం తాత్కాలికంగా సింగిల్ ఫేస్ సరఫరాతో గ్రామంలో గృహాలకు, వీధి లైట్లకు సరఫరా పునరుద్ధరించారు. త్రీఫేస్ విద్యుత్ సరఫరా లేకపోవడంతో బోర్లు, పంపింగ్‌కు మోటార్లు పనిచేయకపోవడంతో లింగాలగట్టు ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

భర్తపై భార్య ఫిర్యాదు

మహానంది: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై భార్య బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. అబ్బీపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుతో వెంకట పావనికి మూడేళ్ల క్రితం వివాహం అయింది. ఇటీవల అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేసిందని ఎస్‌ఐ తెలిపారు.

భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయండి

- ఇన్‌చార్జ్ ఈఓ ఇ.చంద్రశేఖరరెడ్డి


గణేశ సదన్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో నవంబరు 2 నుంచి జరగనున్న కార్తీకమాసంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని శ్రీశైల దేవస్థాన ఇన్‌చార్జ్ కార్యనిర్వహణాధికారి ఇ.చంద్రశేఖరరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన గణేశసదన్, అన్నప్రసాద వితరణ, భారత్ పెట్రోల్ బంక్, మల్లికార్జున సదన్ ఎదురుగా పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద వితరణ భవనంలో ఏర్పాట్లు చేయా లని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. గణేశ సదనమ్‌లో భక్తులకు గదులు కేటాయించేటప్పుడు ఆధా ర్ కార్డు తప్పనిసరిగా పరిశీలించాలని సూచించా రు. భక్తులతో మర్యాదగా మెలగాలని సూచించారు. క్షేత్రంలో పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఏ ఒక్క భక్తుడి నుంచి కూడా ఫిర్యాదు లేకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. గణేశ్ సదన్ వద్ద మినీ కల్యాణ కట్ట, భారత్ పెట్రోల్ బంక్ వద్ద ఏటీఎంలను ఏర్పాటు చేయా లని సూచించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.నరసింహారెడ్డి, డీఈఈ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోండి

బండిఆత్మకూరు: భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని ఎర్రగుంట్ల గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా కాంప్లెక్స్ ఎరువులను దుక్కిలో వాడాలన్నారు. మోతాదుకు మించిన ఎరువులు, పురుగు మందులు వాడరాదన్నారు. పొలాల్లో నిలిచిన వర్షపునీటిని తొలగించుకోవాలన్నారు. అనంతరం వరిపైరులో వచ్చే తెగుళ్లు, చీడపీడల నివారణకు అనుసరించాల్సిన పద్ధతులపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ రాజశేఖర్, వ్యవసాయాధికారి స్వాతి పాల్గొన్నారు.

- కొత్తపల్లి: మండలంలోని గోకవరం, ఎదురుపాడు గ్రామాల పరిధిలోని పొలాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ కె.మహేష్ మినుము రైతులు పల్లాకు తెగులు నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్రవంతి పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి


ఉద్యోగులకు మెగా చెక్కును అందజేస్తున్న డిపో మేనేజర్ మహేంద్రుడు

ఆత్మకూరు: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు డ్రైవర్లు, కండక్టర్లకు సూచించారు. సంస్థకు అత్యధిక ఆదాయం, కేఎంపీఎల్ సాధించిన కండక్టర్లు పి.సరస్వతి, ఈ.ఎస్.లక్ష్మి, డి.బి.నాయక్, ఎం.జె.రావు, ఎస్.ముర్తుజాబి, డి.జె.నాయక్, కె.నాగన్న, ఎస్.వి.నాయక్, జి.ఆర్.ఎల్.రెడ్డి, పి.దర్గయ్య, ఎం.కలిముల్లా, ఎస్.కె.వలి, ఎ.ఓబులేష్, ఎం.కమరుద్దీన్, జి.వి.రమణలను బుధవారం డిపో ఆవరణలో అభినందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ వీరిని మిగతా వరు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం నగదు ప్రోత్సాహం కింద చెక్కులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

వ్యవసాయ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు


మాట్లాడుతున్న డాక్టర్ వీర జయలక్ష్మి

మహానంది: వ్యవసాయ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మహానంది ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వీరజయలక్ష్మి తెలిపారు. కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన దీక్షారంభ్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యవసాయ ఆధారిత భారతదేశంలో వ్యవసాయ కోర్సులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. క్రమశిక్షణతో మెలుగుతూ అంకితభావంతో విద్యను అభ్యసించి తల్లిదండ్రుల కష్టానికి తగిన ఫలితం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఓ ఎస్ ఏ డాక్టర్ ఎల్. విజయభాస్కర్, ఓఏఎం డాక్టర్ ఫరీదా, అగ్రానమీ ప్రొఫెసర్ డాక్టర్ సుబ్బరామిరెడ్డి, గర్ల్స్ హాస్టల్ వార్డెన్ డాక్టర్ స్వరాజ్య లక్ష్మి బాయ్స్ హాస్టల్ వార్డెన్ డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మల్లేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

సమయానికి బస్సులు నడపాలి


డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఆత్మకూరు: విద్యాసంస్థల సమయానికి బస్సులను నడపాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.దినేష్ మార్, మండల అధ్యక్ష, కార్యదర్శులు సాయిప్రశాంత్ డిమాండ్ చేశారు. బుధవారం వారు డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మాట్లాడుతూ విద్యనభ్యసించడానికి గ్రామాల నుంచి విద్యార్థులు పట్టణానికి వస్తున్నారన్నారు. పాఠశాలల సమయానికి బస్సులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం సమయానికి బస్సు సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బాబు, అంజి, వంశీ, భరత్, బాలాజీ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

వెలుగోడు: సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. మోతుకూరు గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. నవంబర్ 30లోగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఐఓ రవీంద్ర పాల్, మండల సర్వేయర్ ఉపేంద్ర పాల్గొన్నారు.

- మహానంది: సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ కామేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం బొల్లవరం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి భూ సర్వేలో చోటుచేసుకున్న సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు.

ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు

మహానంది: మహానంది సమీపంలోని చెంచులక్ష్మి గిరిజన గూడెంలో గిరిజనులు సాగు చేస్తున్న పంట పొలాలకు నీటి సౌకర్యం కోసం విద్యుత్ సరఫరా లభించింది. జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు అధికారులు బుధవారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు.

వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

ఆత్మకూరు: వ్యవసాయంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అగ్రికల్చర్ ఒకేషనల్ వీటీఎస్ నూర్‌మహ్మద్ సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 9, 10వ తరగతి విద్యార్థులను హెచ్‌ఎం కె.నాగరాజు, పాఠశాల ఇన్‌చార్జ్ ఫైజుల్లా ఆధ్వర్యంలో అగ్రికల్చర్ ఒకేషనల్ వీటీఎస్ నూర్‌మహమ్మద్ వ్యవసాయంపై అవగాహన కల్పించారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

బండిఆత్మకూరు: ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.దస్తగిరి అన్నారు. మండలంలోని పార్నపల్లె గ్రామంలో బుధవారం ఆధార్ సేవల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు లబ్ధి పొందాలన్న, ఏ ఇతర పథకానికైనా ఆధార్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆధార్ సేవలు గ్రామాల్లో అందుబాటులో తెచ్చేందుకే ప్రత్యేకంగా ఈ సేవలతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల వారు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కత్తితో దాడి

మహానంది: మండల పరిధిలోని గోపవరంలో బుధవారం ఓ వ్యక్తికి కొందరు కత్తితో దాడి చేశారు. ఎస్‌ఐ రామ్మోహన్ రెడ్డి తెలిపిన వివరాలు.. నంద్యాలకు చెందిన మధుబాబు గోపవరంలో పాలు సేకరించుకునే క్రమంలో గ్రామానికి చెందిన సుబ్బయ్యకు రూ.లక్ష అడ్వాన్సు ఇచ్చాడు. నీళ్ల పాలు పోస్తున్నావని, తనకు వద్దని, ఇచ్చిన అడ్వాన్స్ వెనక్కి ఇవ్వాలని సుబ్బయ్య కోరాడు. ఈక్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో సుబ్బయ్యతోపాటుఅదే గ్రామానికి చెందిన సుబ్బారావు, ధర్మ, శ్రీను కలిసి మధుబాబుపై కత్తితో దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు నెహ్రూనగర్ క్రీడాకారులు

పగిడ్యాల: ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ఎంపికైనట్లు హెచ్‌ఎం శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ –14 జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో తమ విద్యార్థులు మహేష్, షెహనాజ్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం సంతోషకరమన్నారు.